నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | మంగళవారం 26 డిసెంబర్ 2023 | MAHABUBABAD


హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చిలో క్రీస్తు సందేశం వినిపిస్తున్న పాస్టర్ నిరంజన్‌బాబు


హనుమకొండ సీబీసీలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

# క్రిస్‌మస్తే

## ఉమ్మడి జిల్లాలో ఘనంగా ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు

- ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకొన్న క్రైస్తవులు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు
- క్రీస్తు సందేశం వినిపించిన పాస్టర్లు
- పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

ప్రపంచానికి శాంతి సందేశం వినిపించి ప్రేమను పంచిన ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుక లను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సోమవారం క్రైస్తవులు చర్చిలకు వెళ్లి ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకొన్నారు. కేక్ కటింగ్ చేసి హ్యాపీ క్రిస్మస్, మెర్రీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఏసు ప్రభువును కొలుస్తూ పాటలు పాడారు. పాస్టర్లు, మత పెద్దలు ఏసుక్రీస్తు శాంతి సందేశాన్ని వినిపించారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని సూచించారు. చర్చిల వద్ద క్రిస్టియన్లు సరదాగా సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, కాజీపేట ఫాతిమా నగర్‌లోని కెథడ్రల్, కరుణాపురంలోని క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరం, డోర్నక ల్‌లోని సీఎస్ఐ, యశ్వంతాపూర్‌లోని షాలోమీ బాప్టిస్టు, తదితర చర్చిల్లో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వరంగల్ నగరంలో మంత్రి కొండా సురేఖ, ములుగు జిల్లాలో మంత్రి సీతక్క పాల్గొనగా, ఆయా చర్చిల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

– నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 25






హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేసేందుకు వచ్చిన క్రిస్టియన్లు


గోవిందరావుపేట: గుండ్లవాగు బ్రిడ్జి వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలి
- సమష్టి కృషితో మేడారం మహాజాతరను విజయవంతం చేయాలి
- పీఆర్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క
- జాతర అభివృద్ధి పనుల పరిశీలన


తాడ్వాయి/గోవిందరావుపేట, డిసెంబర్ 25: వచ్చే ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మల మహాజాతర అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మంత్రి పీఆర్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. మేడారం మహాజాతర సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. 33 పార్కింగ్ ప్రదేశాలతోపాటు చింతల్‌క్రాస్, ఊరట్టం వంతెన, చిలకలగుట్ట, వీఐపీ పార్కింగ్, ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించి, చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నా రు. అదేవిధంగా గోవిందరావుపేట మండలంలోని పస్రా సమీపంలోని గుండ్లవాగు బ్రిడ్జిని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టి అన్ని శాఖల అధికారులు సమష్టి కృషితో మహాజాతరను విజయవంతం చేయాలన్నారు. ఆరు నెలల క్రితం కురిసిన భారీ వర్షంతో గుండ్లవాగు బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు కొట్టుకుపోగా ఎన్‌హెచ్ అధికారులకు మరమ్మతులు చేపట్టారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టాలని మంత్రి సూచించారు. అంతేకాకుండా బ్రిడ్జి పక్కన వాగులో మరో అప్రోచ్ రోడ్డు వేయించాలన్నారు. అదేవిధంగా పస్రా–మేడారం రహదారిలో కొట్టుకుపోయిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి భక్తులకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పనులను వేగవంతం చేసేలా చూడాలన్నారు. మంత్రి సీతక్క మొదటగా అమ్మవార్ల దర్శనానికి వెళ్లగా పూజారులు, దేవాదాయశాఖ అధికారులు, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ అంకిత్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఎస్పీ గాష్‌ఆలం ఘనంగా స్వాగతం పలికి తల్లుల గద్దెల వద్దకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలపై పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొ క్కులు చెల్లించుకున్నారు. మంత్రికి పూజారులు అమ్మవార్ల వస్త్రాలతో పాటు ప్రసాదాన్ని అందజేశారు.

# ఎంజీఎంలో మరో కేసు..

- దవాఖానలో ప్రస్తుతం ఇద్దరు మహిళ లకు చికిత్స
- ఆందోళ న చెందాల్సిన అవసరం లేదు
- వారి ఆరోగ్యం నిలకడగానే ఉందన్న వైద్యులు




వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 25: వరంగల్ ఎంజీఎం దవాఖానలో మరో కరోనా జేఎన్1 కేసు నమోదైంది. ఇదివరకే భూపాలపల్లి జిల్లాకు చెందిన మహిళ చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈమె కుటుంబసభ్యులు నలుగురికి కూడా పాజిటివ్ రావడంతో హోం ఐసొలేషన్‌లో కోలుకుంటున్నారు. ఆదివారం వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రాంతానికి చెందిన మహిళ అనారోగ్యంగా ఉందని ఎంజీఎం వైద్యులను ఆశ్రయించింది. లక్షణాలను గుర్తించిన వైద్యులు నమూనాలు సేకరించి ల్యాబ్ పంపించారు. సోమవారం అందిన ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా సదరు మహిళకు కరోనా జేఎన్ 1 కరోనా సోకినట్లు గుర్తించినట్లు ఎంజీఎం దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బాధితురాలికి కొవిడ్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. ఈ వార్డులో ప్రస్తుతం ఇద్దరు మహిళలు చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బాధితురాలి వివరాలను జిల్లా వైద్యాధికారికి తెలిపామని, ఆమె కుటుంబసభ్యులకు సైతం పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కరోనా లక్షణాలు గుర్తించిన వారు నేరుగా ఎంజీఎం దవాఖానలోని కొవిడ్ వార్డులో ఏర్పాటు చేసిన రాపిడ్ టెస్ట్ సెంటర్‌లో పరీక్షలు చేయించుకోవచ్చునని తెలిపారు.



# రేపటి నుంచి గిరిజన గురుకులాల రాష్ట్ర స్థాయి క్రీడలు

కాటారం, డిసెంబర్ 25 : గిరిజన గురుకులాల 7వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు కాటారం గిరిజన గురుకుల బాలుర కళాశాలలో బుధవారం నుంచి ఈ నెల 30 వరకు జరగనున్నట్లు మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ఆర్‌సీవో నీలం ముత్తయ్య, గిరిజన గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ జేకే బుచ్చయ్య తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మా ట్లాడుతూ రాష్ట్రంలో 4 జోన్లు ఉన్నాయని, ఆదిలాబాద్, కరీంనగర్, భూపాలపల్లి, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల నుంచి జోన్‌కు 300 మంది చొప్పున 1200 మంది బాలు రు పోటీల్లో పాల్గొంటారని అన్నారు. అక్టోబర్‌లో జరిగిన జోనల్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులు పాల్గొంటారని, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టెన్నిస్, హాకీ, క్యారం, చెస్, పుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ, బాక్సింగ్, అథ్లెటిక్స్‌లో 100, 200, 400, 600, 800 మీటర్లు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, హ్యాండ్‌బాల్ పోటీలుంటాయన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు, సిబ్బందికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.


వాజేడు మండలంలో చలి మంట వేసుకున్న గ్రామస్తులు


వాజేడు మండలంలోని ప్రగళ్లపల్లి గ్రామంలో రహదారిని కమ్ముకున్న మంచుదుప్పటి



# మన్యంలో మంచు దుప్పటి

## లైట్లు వేసుకొని ప్రయాణించిన వాహనదారులు

*వాజేడు, డిసెంబర్ 25 : ములుగు జిల్లా వాజేడు ఏజెన్సీలో కొన్నిరోజులుగా మంచు విపరీతంగా కురుస్తున్నది. సోమవారం ప్రగళ్లపల్లి, జగన్నాథపురం తదితర మన్యం గ్రామాలను మంచు దుప్పటి కప్పేసింది. వాజేడు నుంచి వెంకటాపురం మండలానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారితో పాటు 163 జాతీయ రహదారిపై పొగమంచు పరుచుకోవడంతో వాహనదారులు ఉదయం 9 గంటలకు సైతం లైట్లు వేసుకొని ప్రయాణించారు. పొగమంచుకు తోడు తీవ్రమైన చలి కారణంగా ముఖ్యమైన పనులుంటే తప్ప ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. కాగా, ఉదయం చలిమంటలు వేసుకొని స్థానికులు ఉపశమనం పొందుతున్నారు.*

# విద్యార్థుల భవితకు పీటీఎం

- ప్రతి 3వ శనివారం 'పేరెంట్స్-టీచర్స్ మీటింగ్'
- సమావేశాల్లో తల్లిదండ్రుల పాత్ర ఉండేలా నిర్ణయం
- బడి, పిల్లల శ్రేయస్సే ముఖ్యోద్దేశం
- పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం విస్తృతం

**పిల్లలకు కుటుంబమే మొదటి బడి.. తల్లిదండ్రులే తొలి గురువులు.. వారి పాత్రే పిల్లల అభ్యాసానికి కీలకం. అందుకే తల్లిదండ్రులు అన్ని విద్యా కార్యకలాపాల్లో పాల్గొనాలి. పిల్లల నమోదు, హాజరు, డ్రాపౌట్‌లు, పాఠశాల నిర్వహణ తీరు, పాఠశాల అభివృద్ధి కార్యకలాపాలపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో రెండు నెలలకోసారి స్కూల్ మేనేజ్‌మెంట్(ఎస్ఎంసీ) సమావేశాలు నిర్వహిస్తారు. అయితే చాలామంది తల్లిదండ్రులు ఈ వ్యవహారాల్లో పాలుపంచుకోరు. ఈ నేపథ్యంలో వారి ప్రాతినిధ్యం విస్తృతం చేయడం, భాగస్వామ్యం చేయడం, పాఠశాలల శ్రేయస్సు కోసం వారి గొంతుక వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2023-24 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీతో పాటు ప్రతి నెల 3వ శనివారం పేరెంట్ టీచర్స్ మీటింగ్(పీటీఎం) నిర్వహిస్తున్నది.**

**– నెల్లికుదురు, డిసెంబర్ 25**

పాఠశాలల్లో అభివృద్ధి కార్యకలాపాలు, పాఠశాల నిర్వహణ, పాఠశాల పనితీరు తదితర వాటిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే ప్రతి రెండు నెలలకోసారి ఎస్‌ఎంసీ సమావేశాలను నిర్వహిస్తున్నది. ఈ కమిటీలో ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే ఉంటారు. ఇక నుంచి పాఠశాలల అభివృద్ధిలో ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి నెల మూడవ శనివారం తప్పనిసరిగా పేరెంట్స్ టీచర్ సమావేశాలు(పీటీఎం) నిర్వహిస్తున్నది.


ముడుపుగల్లు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో చర్చిస్తున్న మహబూబాబాద్ డీఈవో రామారావు(ఫైల్)

### పీటీఎం నిర్వహించడం ఇలా..

ప్రతి నెల మూడవ శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలి. ఒకవేళ ఆ రోజు సెలవుంటే 4వ శనివారం నిర్వహించాలి. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తల్లిదండ్రులను సమావేశాలకు ఆహ్వానించాలి. విద్యార్థుల ప్రగతిని, వివిధ రంగాల్లో కనబరిచిన సామర్థ్యాలను వారి తల్లిదండ్రులకు తెలియజేయాలి.

### చర్చించాల్సిన అంశాలు..

ప్రాథమిక పాఠశాలలో 'తొలిమెట్టు' అమలుపై, మన ఊరు–మన బడి/మన బస్తీ–మన బడి, ఆంగ్ల మాధ్యమ బోధనపై అవగాహన కల్పించాలి. విద్యార్థుల హాజరు పెంపు కోసం తీసుకునే చర్యలు, వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై తల్లిదండ్రులతో చర్చించాలి. మధ్యాహ్న భోజన అమలుపై చర్చ జరుపాలి. సమావేశం జరిగే రోజు నో బ్యాగ్ డే, బాలసభ వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులకు ప్రభుత్వం అందించే సదుపాయాలు, అవకాశాలు, స్కాలర్‌షిప్‌ల వంటి విషయాలను వారికి తెలియజేయాలి.

### ప్రధానోపాధ్యాయుల బాధ్యతలు

సర్పంచ్, ఎస్ఎంసీ చైర్మన్, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముందుగా హెచ్‌ఎం సమావేశమై పీటీఎం సమావేశాలపై ప్రణాళిక తయారుచేసుకోవాలి. సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు 100 మంది హాజరయ్యేందుకు స్వయం సహాయ సంఘాల సభ్యుల సహకారం తీసుకోవాలి. నెలవారీ ఎజెండా ప్రకారం చర్చ జరిపేలా చూడాలి. ప్రతి సమావేశంలో చేసిన తీర్మానాలను రిజిస్టర్‌లో నమోదు చేసి తదుపరి సమావేశంలో సమీక్షించాలి.

### ఉపాధ్యాయుల, అధికారుల బాధ్యతలు..

తరగతి ఉపాధ్యాయులు విద్యార్థుల బలాలు, బలహీనతలు తరగతులు, విషయాల వారీగా గుర్తించి ప్రొఫైల్స్ తయారు చేయాలి. విద్యార్థుల ప్రగతిని తెలుపుతూ పాఠశాలలో నిర్వహించే వివిధ రకాల పోటీ పరీక్షలు, ఇన్‌స్పైర్, ఎన్ఎంఎంఎస్, ఎన్‌టీఎస్ఈ, ఒలింపియాడ్స్, ఆన్‌లైన్ క్విజ్‌లు వంటి వాటి గురించి తెలియజేయాలి. విద్యార్థుల విద్యాపరమైన, సాంస్కృతిక, ఆరోగ్యం, మానసిక స్థితిగతులు, అభిరుచులు, వైఖరులు, అలవాట్లు మొదలైన వాటి గురించి చర్చ జరపాలి. అధికారులు నిరంతరం పాఠశాలలను పర్యవేక్షిస్తూ తల్లిదండ్రుల సమావేశాలు కొన్నింటికి ప్రత్యక్షంగా హాజరుకావాలి. డీఆర్డీవో, మెప్మా, ఎస్‌హెచ్‌జీ వంటి వారి సహకారంతో సమావే శాలను విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలి.